ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




రంజాన్ వేళలు

ఇఫ్తార్ | 6:38 సోమవారం

సహర్ | 4:42 మంగళవారం

యువత క్రీడల్లో రాణించాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 7: యువత క్రీడల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణరావు అన్నారు. ఆయన ఆదివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో జరుగుతున్న ఐపీఎల్ టోర్నమెంట్‌ని కాంగ్రెస్ నాయకులు కొమిరెడ్డి విజయ్ అజాద్‌తో కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ సంజీవ్‌యాదవ్, నాయకులు రాజశేఖర్, ప్రమోద్, రాకేష్ పాల్గొన్నారు.



ఓటింగ్ శాతం పెంపుపై ఫోకస్

- అత్యల్పంగా నమోదైన కేంద్రాలపై నజర్
- స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు
- ఓటు నమోదుకు ఈనెల 15వ తేదీ వరకే చాన్స్

జగిత్యాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికార యంత్రాంగం ఫోకస్ చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువగా ఓటింగ్ నమోదైన కేంద్రాలను గుర్తించి వీటి పరిధిలోని ఓటర్లను చైతన్యం చేస్తున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 50 శాతం పోలింగ్ నమోదైన కేంద్రాలను గుర్తించారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టీసిపేషన్ (స్వీప్) ద్వారా అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 785 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో కోరుట్లలో 362, జగిత్యాలలో 254, ధర్మపురిలో 269 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా ధర్మపురి నియోజకవర్గంలో, అత్యల్పంగా జగిత్యాల నియోజకవర్గంలో పోలింగ్ అయింది. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో అత్యల్పంగా ఓటింగ్ శాతం నమోదైన ప్రాంతాలను గుర్తించారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచాలని ఉన్నతాధికారులు జిల్లా యంత్రాంగానికి సూచించింది. దీంతో అధికారులు పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకోవడం, ఈవీఎంల వినియోగంపై స్వీప్ ద్వారా ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నారు. మహిళా సంఘాల్లోని సభ్యులు, కాలేజీల్లో యువతకు, యువజన సంఘాల సభ్యులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

● అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు...

ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రజల్లో అవగాహన పెంచేందుకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా 'ఐ ఓట్ ఫర్ షూర్' అను నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రధాన పట్టణాల్లో 5కే రన్ జరుపుతున్నారు. యువజనులతో పాటు వివిధ వర్గాలకు చెందిన వారు ఉత్సాహంగా పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. ఒకవైపు ఓటర్లుకు అవగాహన ర్యాలీలు, మరో వైపు పోలింగ్ సిబ్బందికి శిక్షణా తరగతులు, ఇంకొక వైపు భద్రతా బలగాల కవాతు, తనిఖీలతో బిజీబిజీగా ఉన్న అధికారులు పోలింగ్ శాతం పెంచడం పైననూ ప్రధానంగా దృష్టి సారించారు. అర్హులైన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేసేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

● కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక చొరవ...

జిల్లాలో పోలింగ్ శాతం పెంచడంపై కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. పలు మారుమూల ప్రాంతాల్లో గల పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించి స్థానికులతో సమావేశాలు నిర్వహింపజేస్తూ ఓటు హక్కు ఆవశ్యకతను వివరించేలా అధికారులను ప్రోత్సహిస్తున్నారు. ఆయా కేంద్రాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండడానికి గల కారణాలను స్థానికుల ద్వారా సమాచారం సేకరిస్తున్నారు. ప్రధానంగా కిరాయి దారులు, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు ఓటేసేందుకు రాకపోవడంతో తక్కువ ఓటింగ్ నమోదైందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నట్లు తెలుస్తోంది. ఒకే ఇంట్లోని వ్యక్తులకు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు రావడం, చనిపోయిన వ్యక్తులతో పాటు, కొందరికి రెండు చోట్ల ఓట్లు ఉండడం సైతం పోలింగ్ శాతం తగ్గడానికి కారణాలు భావిస్తున్నారు. అయితే ఈ ఎన్నికల్లో ఓటర్లుగా నమోదై ఉన్న ప్రతీ ఒక్కరూ ఓటేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిస్తున్నారు. 80 ఏళ్ల దాటిని వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసేలా అవగాహన కల్పిస్తున్నారు.

● ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్...

ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో భాగంగా జగిత్యాల జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్‌లో 76.60 శాతం ప్రజలు ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల్లో 6,99,203 మొత్తం ఓటర్లుండగా ఇందులో పురుషులు 3,37,919 మంది, మహిళలు 3,61,254 మంది, ఇతరులు 30 మంది ఉన్నారు. జిల్లాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో 5,35,995 మంది మొత్తం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోగా ఇందులో పురుషులు 2,42,840 మంది, మహిళలు 2,93,140 మంది, ఇతరులు 15 మంది ఓటు వేశారు. జిల్లాలో పురుషుల కంటే మహిళలే పోలింగ్‌లో ఎక్కువగా భాగస్వామ్యం అయ్యారు. జగిత్యాల నియోజకవర్గంలో 75.42 శాతం, కోరుట్ల నియోజకవర్గంలో 75.46 శాతం, ధర్మపురి నియోజకవర్గంలో 79 శాతం పోలింగ్ నమోదైంది.

● ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాలు...

జిల్లాలో కొత్తగా ఓటు నమోదుకు ఈనెల 15వ తేదీ వరకు మాత్రమే చాన్స్ ఉంది. ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తూ అధికారులు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతీ ఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలంటూ ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలో యజమాన్యాల ద్వారా ఓటు నమోదుపై సమావేశాలు పెడుతున్నారు.

● పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాల కల్పన...

పోలింగ్ కేంద్రాల పెంపు, ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు ప్రత్యేక పోత్యేక పోలింగ్ కేంద్రాలు, ఆదర్శ పోలింగ్ కేంద్రాలు, ఆన్‌లైన్‌లో ట్యాగింగ్, పోల్ చీటిపై మ్యాపింగ్, ఫొటోలతో కూడిన ఏర్పాట్లు చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్, ప్రత్యేక బృందాల ఏర్పాట్లు కమిటీలను నియమించారు. పోలింగ్ శాతం పెంపు జరగడానికి అవసరమైన అన్ని కోణాల్లో అధికారులు ముందుకు వెళ్తున్నారు.

ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- షేక్ యాస్మిన్ బాషా, జిల్లా కలెక్టర్



జిల్లాలో ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యాతను వివరిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. తక్కువగా పోలింగ్ జరిగే కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాము. అర్హులైన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకొని వినియోగించుకునేలా ప్రోత్సహిస్తున్నాము.

ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలి



వినతిపత్రం అందిస్తున్న తపస్ ఉపాధ్యాయులు

జగిత్యాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2010 సంవత్సరం కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా కృషి చేయాలని కోరుతూ అఖిల భారతీయ రాష్ట్రీయ సైసిట్ మహా సంఘ్ ప్రతినిధి లక్ష్మణ్‌కు ఆదివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నాయకులు వినతిపత్రం అందించారు. ఆదివారం హైద్రాబాద్‌లో ఆయనను కలిసి సమస్యలను విన్నవించారు. ఉపాధ్యాయులకు ఆదాయపు పన్ను పరిమితిని పెంచుటకై కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్, జగిత్యాల జిల్లాకు చెందిన నాయకులు ఒడ్నాల రాజశేఖర్, నరేందర్ రావు, వెంకటరమణ రావు పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న న్యాయాధికారి



అంజన్న సన్నిధిలో న్యాయాధికారికి ఆశీర్వచనం అందిస్తున్న అర్చకులు

మల్యాల, ఏప్రిల్ 7: కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జి జి.పావని ఆదివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. న్యాయాధికారి వెంట ఆలయ అధికారులతో పాటు ఏఎస్సై చిలుక శ్రీనివాస్ ఉన్నారు

ఉగాది నాడు పంచాంగ శ్రవణం

ధర్మపురి, ఏప్రిల్ 7: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆవరణలో గల శేషప్ప కళావేదికపై ఈనెల 9న సాయంత్రం 5 గంటలకు పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా నిర్వహించే విధంగా వేదం, శాస్త్రం తదితర కళల్లో నిష్ణాతులైన వారికి ఆలయం పక్షాన సన్మానం చేస్తామని ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని కోరారు.

ఎమ్మెల్యేకు మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ



ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న ఎర్రబెల్లి దయాకర్

జగిత్యాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పితృ వియోగానికి గురైన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌ను ఆదివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డులో గల నివాసంలో హనుమంత రావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం అందజేత

జగిత్యాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుట్ట రాజేశ్వర స్వామి ఆలయం గుట్ట పక్కన గల శివ గాయత్రి అనాథ పిల్లల, వృద్ధుల ఆశ్రమానికి అంగడి బజార్‌కు చెందిన అలిశెట్టి గీతా రాణి-లక్ష్మణ్ (రిటైర్డు ప్రధానోపాధ్యాయులు) దంపతులు రూ. 12 విరాళం అందజేశారు. ఆశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివ శంకర్‌కు విరాళం అందజేయడంతో పాటు ఆశ్రమ నిత్యావసర సరుకుల నిమిత్తం ప్రతి నెల రూ. 1,500 చొప్పున అందిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు సూరజ్ శివ శంకర్‌తో పాటు సుజన, సుధారాణి, సురేశ్, కవితా రాణి, తేజా రాణి పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



తాగునీటిని పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

జగిత్యాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్త బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బట్టు రాజేందర్ అన్నారు. ఆదివారం బస్టాండు వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. సామాన్య ప్రజల దాహాన్ని తీర్చడానికి సత్యసాయి సేవా సంస్థ ఆద్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత, కొత్త ప్రతాప్, రాచకొండ విద్యాధర్, కొత్త వేణుగోపాల్, దశరథ రెడ్డి, నారాయణ సింగ్, లక్ష్మీనారాయణ, చంద్రయ్య, రామ్మోహన్ పాల్గొన్నారు.

అటవీ అధికారుల పేరిట వసూళ్లు!

● అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని బెదిరింపులు ● నిలదీసిన ట్రాక్టర్ యజమానులు.. అధికారులకు ఫిర్యాదు

మల్యాల, ఏప్రిల్ 7: అటవి అధికారి వద్ద డ్రైవర్‌గా పని చేసే ఓ యువకుడు ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని వసూళ్లకు పాల్పడడం చర్చనీయాంశంగా మారింది. దీంతో అనుమానం వచ్చిన ట్రాక్టర్ యజమానులు సదరు యువకుడిని నిలదీయడంతో అసలు విషయం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. భీమారం, కమ్మరిపేట తదితర ప్రాంతాల నుంచి మల్యాల, కొడిమ్యాల మండలాలకు చెందిన పలువురు అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్నారు. దీంతో ఇటీవలే అటవి అధికారి వద్ద డ్రైవర్‌గా చేరిన ఓ యువకుడు ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను రాంపూర్, కాసారం తదితర ప్రాంతాలలో పట్టుకొని అటవి అధికారి పేరు చెప్పి నాలుగు రోజులుగా వసూళ్లకు పాల్పడినట్లు ట్రాక్టర్ యజమానులు తెలిపారు. ఒక్కో ట్రాక్టర్ వద్ద రూ.4వేల నుంచి 5వేల వరకు వసూలు చేయడంతో అనుమానం వచ్చిన వారంతా సదరు యువకుడిని నిలదీయడంతో తనను అటవి అధికారి డబ్బులు వసూలు చేయమన్నారని తెలుపడంతో పోలీస్, రెవెన్యూ అధికారులు కాకుండా అటవి అధికారుల పేరిట వసూళ్లకు పాల్పడుతున్న విషయాన్ని ఫారెస్ట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇసుకకు అటవి అధికారులకు ఎలాంటి సంబంధం అంటూ అసహనం వ్యక్తం చేశారు. పైగా డబ్బుల కోసం క్యూఆర్ కోడ్ స్కానర్‌ను వినిమోగిస్తూ డబ్బులు ఇవ్వకపోతే వాహనం సీజ్ చేస్తామని యువకుడు పేర్కొన్నట్లు ట్రాక్టర్ యజమానులు ఈ సందర్భంగా తెలిపారు. అసలే అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందని వారు వాపోయారు. ఈ విషయమై ఓబులాపూర్ అటవీ సెక్షన్ అధికారి రత్నమ్మను సంప్రదించగా డబ్బుల వసూళ్ల విషయం తమ దృష్టికి రాలేదని తామెవరిని డబ్బులు వసూలు చేయాలని సూచించలేదని స్పష్టం చేశారు. డబ్బుల విషయమై రాంపూర్ గ్రామస్థులు సమాచారం అందించనట్లు తెలిపారు. డబ్బులు వసూలు చేసిన యువకుడిని సోమవారం గ్రామస్థుల సమక్షంలో విచారిస్తామని అన్నారు.

● అక్రమంగా ఇసుక రవాణా

ఇటీవల సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలకు మండలాలకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు అయ్యాయి. దీనికి గాను పనులు చేయడానికి మార్కెట్‌లో ఇసుక కొరత నెలకొంది. పైగా పనులను సత్వరంగా పూర్తి చేయాలనే అధికారుల ఆదేశాలతో కాంట్రాక్టర్లు లోకల్ ఇసుకను తీసుకువచ్చి పనులు చేపడుతున్నారు. ఇందుకు భీమారం, కమ్మరిపేట, కాసారం, రాంపూర్ తది తర ప్రాంతాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో లోకల్ ఇసుకను తరలిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాను నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

సరైన ఆరోగ్య అలవాట్లు అలవర్చుకోవాలి



ఉపాధ్యాయులకు పండ్లు అందిస్తున్న డీఈఓ జగన్ మోహన్ రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలను అధిగమించడానికి ప్రతీ ఒక్కరూ సరైన ఆహార అలవాట్లు అలవర్చుకోవాలని జిల్లా విద్యాధికారి జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ బయో సైన్స్ ఉపాధ్యాయుల ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యం ఆవశ్యకతను వివరించారు. ప్రస్తుత కాలంలో పని ఒత్తిడి, కలుషిత ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్ వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. వీటిని అధిగమించడానికి మంచి ఆరోగ్య అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు సాత్విక ఆహారమైన వివిధ పండ్లను అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బయో సైన్స్ ఉపాధ్యాయుల ఫోరమ్ నాయకులు రాజ్ గోపాల్, తిరుపతి, శంకర్, ప్రశాంతి, రాజేందర్, వసంత పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా కోనేరు

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న హనుమాన్ దీక్షపరులు

బీర్‌పూర్, ఏప్రిల్ 7: బీర్‌పూర్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో గల కోనేరు అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. కోనేరులో ఆదివారం కప్పల కలేబరాలు ప్రత్యేక్షం అయ్యాయి. ఇటీవల దీక్ష తీసుకున్న కొందరు హనుమాన్ భక్తులు కోనేరులో స్నానం చేసేందుకు వెళ్లారు. స్నానం చేసేందుకు అందులో దిగే క్రమంలో ఓ వైపు కప్పల కలేబరాలు, మరోవైపు చెత్తా, పాకురు ప్రత్యేక్షం అయ్యాయి. దింతో హన్మాన్ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో భక్తిశ్రద్ధలతో ఆలయానికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా అపరిశుభ్రంగా ఉంచడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భక్తుల విశ్వాసంపై ఇంత నిర్లక్ష్యం పనికిరాదని కొందరు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోనేటిలోని నీటి తొలగించి శుభ్రం చేసి శుద్ధమైన నీటి నింపాలని కోరుతున్నారు.

సుర్రుమంటున్న సూరీడు

- జిల్లాలో మండుతున్న ఎండలు
- 44 డిగ్రీలకు పైగా నమోదు
- వడగాలులతో అల్లాడుతున్న జనం

జగిత్యాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు మండే అగ్ని గోళంగా మారాడు. రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండగా, జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రత మరింతగా పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఆదివారం జిల్లాలో 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. ఇతర ప్రాంతాల్లో సైతం 40 డిగ్రీల పైగానే నమోదు కావడం ఎండ తీవ్రతను తెలియజేస్తోంది. మధ్యాహ్న సమయంలో అత్యవరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు.

● భగ భగ మంట...

భానుడి ఉగ్ర రూపానికి జనం అల్లాడి పోతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ అధికమై ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం, వేళ వడగాలుల ప్రభావంతో బయటకు రావడానికే జంకుతున్నారు. ఈ సమయాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రత 44 డిగ్రీలకు పైగా ఉంటుండగా...సాధారణం కన్నా 2 నుంచి 3 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదు అవుతోంది. కొద్ది రోజులుగా జిల్లాలో ఇదే పరిస్థితి ఉండగా... వడగాలులు తోడు కావడంతో రోజువారీ పనులతో జీవనం సాగించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● బీర్‌పూర్‌లో అత్యధికం...

జిల్లాలోని బీర్‌పూర్ మండలంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. బీర్‌పూర్ మండలం కొల్వాయిలో 44.1 సెల్సియస్ డిగ్రీలు నమోదు కాగా, రాయికల్ మండలం అల్లీపూర్‌లో 43.9, వెల్గటూరు, ధర్మపురి మండలం జైనాలో 43.4, ఇబ్రహీంపట్నం మండలం గోదూరులో 43.3, మెట్‌పల్లిలో 43.1, ఎండపల్లి మండలం మారేడుపల్లిలో 43.0, వెల్గటూరు మండలం గుల్లకోట, ధర్మపురి మండలం నేరేళ్ల, బుగ్గారం మండలం సిరికొండలో 42.7 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



జగిత్యాలలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన చౌరస్తా



జనం లేక బోసిపోతున్న బైపాస్ రహదారి

● అప్రమత్తతే ముఖ్యం...

జిల్లాలోని పలు ప్రాంతాలు ఇప్పటికే ఆరెంజ్ అలర్ట్‌లో ఉన్నాయి. ఉష్ణోగ్రత 44 డిగ్రీలకు పైగా నమోదు అవుతుండడంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రత మరింత పెరిగే అవకాశాలున్నందున అందుకు తగ్గట్టుగా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. మధ్యాహ్న సమయంలో ప్రజలు పనులకు కూడా వాయిదా వేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇక వృద్ధులు, చిన్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని..వడ దెబ్బ బారిన పడకుండా కాపాడుకోవాలని చెబుతున్నారు.

తండాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు

- 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిపేట , వీర్నపల్లి మండలాల్లోని బుగ్గరాజేశ్వరతండా, రాశిగుట్టతండాల్లో ఎక్సైజ్ సీఐ ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు ఆదివారం మెరుపు దాడులు నిర్వహించారు. సారా తయారీ కేంద్రాలను కనుగొని నిల్వ చేసిన 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న 14 లీటర్ల సారా, ద్విచక్రవాహనంతో పాటు సారా తయారీ ముడి సరుకైన 20 కిలోల పటిక, 10 కిలోల ఇప్పపువ్వును స్వాధీన పర్చుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ ఎం శ్రీనివాస్ చెప్పారు. సారా తయారీ, రవాణా, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో తండాల్లో నిఘాను తీవ్రతరం చేశామని తెలిపారు. నిత్యం తనిఖీలు, దాడులు నిర్వహించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ ఎం. శ్రీనివాస్ స్పష్టం చేశారు. దాడుల్లో సిబ్బంది రాజు, కిశోర్, మల్లేశ్, కృష్ణకాంత్, లావణ్య, శ్రీవాణి పాల్గొన్నారు.


● కొదురుపాక గ్రామం


● రుద్రవరం గ్రామం


● రుద్రవరం వేణుగోపాల స్వామి ఆలయం

ఇంకిన నీటిలో కదలాడుతున్న జ్ఞాపకాలు

వందల మంది నడిచిన దారులు.. వేల మందికి తిండిపెట్టిన పొలాలు.. ఎండలు మండినా చల్లని నీటినిచ్చిన బావులు.. ఊరందరినీ కాపాడిన దేవుళ్ల ఆలయాలు.. పిల్లలకు చదువు నేర్పి పెద్ద చేసిన పాఠశాలలు.. ఇవి మావీ అనుకుని నిశ్చింతగా జీవనం గడిపిన ఇళ్లు.. ఇలా.. ఒక్కొక్క జ్ఞాపకం తడారుతున్న నేల నుంచి బయటకు వస్తూ నిర్వాసితుల గుండెలు మెలిపెడుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్మించిన మిడ్ మానేరు, అనంతగిరి ప్రాజెక్టుల్లో 11 గ్రామాలు, 19,446 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. కాళేశ్వరం నుంచి నీటి విడుదల నిలిచిపోవడంతో అనంతగిరి, మిడ్‌మానేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిపోయాయి. దీంతో ప్రాజెక్టుల్లో ముంపునకు గురైన గ్రామాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు అక్కడికి వచ్చి తమ గ్రామాలను, ఇళ్లను చూస్తూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ■ ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల

- ప్రాజెక్టుల నిర్మాణానికి ఉన్న ఊరు.. తిండిపెట్టే భూములను ఇచ్చిన నిర్వాసితులు
- ప్రస్తుతం నీటిమట్టాలు తగ్గడంతో బయటపడుతున్న నాటి ఆనవాళ్లు
- అప్పటి రోజులను గుర్తు చేసుకుంటున్న గ్రామస్థులు

జిల్లాలోని మానేరు వాగుపై బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులో 11 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 7419 ఇళ్లే, 19446 ఎకరాల వ్యవసాయ భూములు, ముంపునకు గురయ్యాయి. 10,131 కుటుంబాలు తమ ఇళ్లను వదిలిపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం అరకొర పరిహారం చెల్లించినా, ఎన్నో రకాల అసంతృప్తులు ఉన్నా నిర్వాసితులు ఉన్న ఊరును విడిచిపెట్టి పోయారు. వినని వారిని ప్రభుత్వం బలవంతంగా ఖాళీ చేయించింది. తమ తాత, ముత్తాతల నాటి భూములు, ఇళ్లను వదిలి వెళ్లిన వారు కొత్త ప్రాంతాల్లో ఇమడ లేక నానా ఇబ్బందులు పడ్డారు. రోజులు గడుస్తున్న కొద్దీ ప్రాజెక్టుల్లో నీరు నింపడం ప్రారంభమైంది. ఒక్కొక్కటిగా గ్రామాలు నీటిలో మునిగిపోయాయి. మిడ్‌మానేరు అనుబంధంగా నిర్మించిన అన్నపూర్ణ ప్రాజెక్ట్ కూడా జిల్లాలోని ఇల్లంతకుంటలో ఉంది. 1.5 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించిన ప్రాజెక్టులో అనంతగిరి గ్రామం ముంపునకు గురయ్యింది. 3947 ఎకరాల భూమి, 1124 కుటుంబాలు తరలిపోయాయి. ప్రస్తుతం వేసవి కాలంలో ఎండలు పెరిగాయి. కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినడంతో మిడ్‌మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్టులకు వచ్చే నీరు నిలిచిపోయింది. 27.50 టీఎంసీ సామర్థ్యం ఉన్న మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 7.50 టీఎంసీలు, అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో 0.83 టీఎంసీలు మాత్రమే ఉంది. ప్రాజెక్టులలో నీరు తగ్గడంతో ముంపునకు గురైన గ్రామాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. దీంతో నాడు గ్రామాలను వదిలివెళ్లిన గ్రామస్థులు తమ ప్రాంతాలకు వచ్చి అప్పటి రోజులను గుర్తు చేసుకుంటున్నారు. తాము చదువుకున్న బడిని చూసి స్నేహితులతో ఆటలాడుకున్న స్థలాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. శరీరం సహకరించకున్నా వృద్ధులు అక్కడికి వచ్చి తమ గ్రామాలను మళ్లీ చూస్తామో.. లేదోనని ఉద్విగ్నానికి గురవుతున్నారు.


● శాభాష్‌పల్లి గ్రామం


● చీర్లవంచ గ్రామం




● రుద్రవరం ప్రభుత్వ పాఠశాల

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ


క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఆదివారం నాడు భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ కారణంగా లఘు దర్శనం అమలు చేయడంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. కళాభవన్‌లో శ్రీ స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరిదేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ ఆలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మహాలింగార్చన

వేములవాడ, ఏప్రిల్ 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి ఆదివారం మహా లింగార్చన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఆలయ అర్చకులు ఉదయం వేళలో శ్రీ స్వామివారికి మహా మండపంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం శ్రీస్వామివారి కల్యాణ మండపంలో మహాలింగార్చన నిర్వహించారు. లింగాకారంలో అమర్చిన ప్రమిదలలో మహిళలు జ్యోతులు వెలిగించారు.

సమాజంలో అసమానతలను రూపుమాపాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 7: సమాజంలో అసమానతలను రూపుమాపడానికి కవులు, రచయితలు కృషి చేయాలని తెలంగాణ విశ్వవిద్యాలయ అవార్డు గ్రహీత, సాహితీవేత్త డాక్టర్ గండ్ర లక్ష్మణ్‌రావు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో ఆదివారం సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి 28వ వార్షికోత్సవం సందర్భంగా సామాజిక చైతన్య దీపిక, జ్ఞానదీపికలు, పలువురికి ఉగాది సత్కారాలు పురస్కారాలు పుస్తకాలను అవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు రచయితలు, కవులను సత్కరించారు. కార్యక్రమంలో సిరిసిల్ల సాహితి సమితి అధ్యక్షుడు డాక్టర్ జనపాల శంకరయ్య, ప్రధాన కార్యదర్శి వెంగలలక్ష్మణ్, కవులు, రచయితలు గోశికొండ మురారి పంతులు, పోరండ్ల మురళీధర్, అఖిలభారత రచయితల సంఘం అధ్యక్షు జూకంటి జగన్నాథం, కరుణాల భద్రాచలం, అకునూరి శంకరయ్య, నీరు రమేష్, చేపూరి బుచ్చయ్య, గుండ్లపల్లి శ్రీనివాస్, శ్రీగాధ మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్నారనే సమాచారంతో అక్కడకు చేరుకుని స్వాధీనపర్చుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పదేళ్ల పాలనలో ప్రజలకు న్యాయం జరగలేదు

- తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

గోదావరిఖని, ఏప్రిల్ 7: ఎందరో పోరాటాలు, బలిదానాలతో ఏర్పడిన తెలంగాణ లో పదేళ్ల పాలనలో ప్రజలకు న్యాయం జరుగలేదని తెలంగాణ జన సమితి అధ్య క్షుడు, ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. ఆదివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన తెలంగాణ ఉద్యోగుల సంఘం మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజ రై మాట్లాడారు. మన ఉద్యోగాలు, మన నీళ్లు, మన నియామకాల నినాదం గాలికి వదిలేశారని, కొద్ది మందికే సంపద మిగిలిందని, నిరుద్యోగ సమస్య తీరుతుందని ఆశపడ్డ నిరుద్యోగులకు నిరాశే మిగిలిందని, తెలంగాణ ఏర్పాటులో సింగరేణి కార్మి కుల పాత్ర మరిచిపోలేనిదని, 45రోజుల పాటు సమ్మె చేసి దేశ వ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కల్పించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా తెలం గాణ సస్యశ్యామలం అవుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. సింగరేణి కార్మికులకు పేస్‌వర్క్‌పై అలవెన్సులు చెల్లించాలని, కార్మికులు ఉత్పత్తి చేసిన బొగ్గులో లాభాల వాటాపై 40శాతం లాభాల వాటా ఇవ్వాలని, ఓపెన్‌కాస్టులతో కాలుష్యం వెదజల్లు తుందని, వీటి స్థానంలో భూగర్భ గనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులను పర్మినెంట్ చేయాలని, మెడికల్ కాలేజీలో సింగరేణి కార్మికుల పిల్లలకు 80శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, సొంతింటి పథకం ద్వారా ఇల్లు ఇవ్వాలని, పదవీవిరమణ పొందిన కార్మికులకు రూ.20లక్షల హెల్త్ కార్డు, కార్మికులకు రూ.20లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని, కార్మికులు పని చేసేచోట నాణ్యమైన పనిముట్లను సమకూర్చాలని, కార్మికులందరికి క్యాడర్ స్కీం ఐదు సంవత్సరాలకు కుదించి అమలు చేయాలని, డిస్మిస్ కార్మికులకు ఎలాంటి నిబంధనలు లేకుండా అందరికి తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రామగుండం రీజియన్ కమిటీ అధ్యక్షులు కామెర గట్టయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు గురిజాల రవీందర్‌రా వు, సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అ హ్మద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వనాథ్, రాములు, ఈదునూరి నరేష్, దేవి సత్యం, కనకయ్య, శేఖర్, వెంకటేషం, కుమార్, భీమయ్య, రాయలింగు, రాయపోషం, సలీంబేగ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న బోనాల జాతర


బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 7: మండలంలోని కోండ్రికర్ల గ్రామంలో కొలిచిన వారికి కొంగుబంగారంగా వెలిసిన మల్లన్న స్వామి బోనాల జాతర వైభవంగా నిర్వహించారు. ఏటా హోలీ తరువాత వచ్చే మొదటి ఆదివారం పెద్దాపూర్ మల్లన్న జాతర యాదవుల ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలను పురోహితుడు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శనివారం రాత్రి స్వామి వారి కల్యాణాన్ని పురోహితులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం బోనాల జాతర నిర్వహించారు. మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకొని శివశక్తుల పూనకాలు, పోతురాజుల నృత్యలతో డప్పుచప్పుల్ల మధ్య ఆలయానికి చేరుకున్నారు. భక్తులు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆయాభివృద్ధి కమిటీ సభ్యులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో జాతర ఉత్సవాల్లో పాల్గొన్న భక్తుల కోసం గ్రామానికి చెందిన గడ్డం రాజారెడ్డి చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆలయాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల పరిధిలోని కొత్తపేటలో నూతనంగా నిర్మించిన ముత్యాల పోచమ్మతల్లి ఆలయంలో ఇటీవలే పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం జరుగగా ఆదివారం బోనాల వేడుక నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మకు మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా పోతరాజు వేషధారణ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్లాల జనార్ధన్‌రెడ్డి, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, నెరెళ్ల భూమరెడ్డి, ఒడ్డెపల్లి శశాంక్, పోతరాజు శ్రీనివాస్, పోతరాజు శ్రీధర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 7: మండలంలోని జోగినిపల్లి క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయికల్ మండల కేంద్రానికి చెందిన కటకం లక్ష్మీకాంతం (60) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మికాతం కోరుట్ల మండలంలోని మాదాపూర్ గ్రామంలో జరిగిన విందు కార్యక్రమంలో పాల్గొన్ని తిరిగి ద్విచక్ర వాహనంపై రాయికల్ వెళుతున్నాడు. జోగినిపల్లి క్రాస్ రోడ్డు వద్దకు చేరుకోగా వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కకు పడిపోయింది. దీంతో తీవ్ర గాయలై లక్ష్మికాతం అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లక్ష్మికాతం బంధువుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కోరుట్ల ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహం అప్పగించినట్లు పోలీసులు వివరించారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

మల్యాల, ఏప్రిల్ 7: మండలంలోని ఓగులాపూర్‌కు చెందిన ఓ మహిళ అప్పుల బాధతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. బొజ్జ లక్ష్మి(38)అనే మహిళ అప్పుల బాధ భరించలేక శనివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆదివారం గ్రామ శివారులోని వేంకటెశ్వర్ల గుట్ట వద్ద చెట్టుకు ఉరి వేసుకొని కనిపించింది. దీంతో గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. లక్ష్మికి భర్తతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. లక్ష్మి భర్త బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కృష్ణకుమార్ తెలిపారు.

పోలీసులకు బాలిక అప్పగింత

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 7 : పెద్దపల్లి మండలంలోని కాపులపల్లి గ్రామం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలికను గమనించిన స్థానికులు కనగర్తి గ్రామహనుమాన్ ఆలయం వద్దకు తీసుకవచ్చి పోలీసులకు సమాచారం అందించారు. అంతకుముందు బాలికను వివరాలు అడుగగా తనది చొప్పదండి మండలం ఆర్నకొండ అని, గుర్తు తెలియని వ్యక్తులు తీసుకవచ్చి వదిలేసినట్లు తెలిపింది. పెద్దపల్లి ఎస్సై 2 మల్లేష్ పోలీస్ స్టేషన్‌కు తరలించి బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించే ప్రయత్నంలో ఉన్నారు.

నేడు హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం

- నేతన్నల సమస్యలపై చర్చ
- జేఏసీ నాయకుల వెల్లడి


సిరిసిల్లలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 7: సిరిసిల్ల నేతన్న సమస్యలపై సోమవారం హైదరాబాద్‌లో అల్ ట్రేడ్ యూనియన్స్ రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్చించనున్నామని జేఏసీ నాయకులు ప్రకటించారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో అదివారం వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్య వేధిక జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ శనివారం రాత్రి సిరిసిల్ల జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన నేతన్నల గర్జనలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసిందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపేలా ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. వస్త్ర పరిశ్రమలపై అధారపడి జీవిస్తున్న నేతన్నలందరికీ ప్రభుత్వం వెంటనే ఉపాధిని కల్పించే విధంగా చర్యలు తీసుకునేలా పోరాడుతామని తెలిపారు. శనివారం రాజీవ్‌నగర్‌కు చెందిన సిరిపురం లక్ష్మీనారాయణ అనే మరమగ్గాల కార్మికుడు సరైన ఉపాధిలేక అర్థికంగా ఇబ్బందులు పడుతూ అత్మహత్యకు పాల్పడ్డారని చెప్పారు. కాగా చేనేత జౌళీశాఖ ఏడీ మాత్రం అనారోగ్యంతో చనిపోయినట్లు పత్రిక ప్రకటన ఇవ్వడం సరికాదన్నా రు. ప్రస్తుతం సిరిసిల్లలో సంక్షోభం వలన ఒక వైపు ఉపాధిలేక మరోవైపు అర్థికంగా ఇబ్బందులు భరించలేక మనస్తాపానికి గురై అత్మహత్య చేసుకుంటే అనారోగ్యం కారాణంగా అంటూ పత్రిక ప్రకటనను ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్, ఎంపీ బండిసంజయ్‌కుమార్ చనిపోయిన కుటుంబాన్ని పరామర్శించి డబ్బులు అందిస్తే సరిపోదని చెప్పారు. మీరు ప్రాతినిత్యం వహిస్తున్న సిరిసిల్లలో నేతన్నల సమస్యల పరిష్కారం కోసం ఏమి చేస్తున్నారో ఆలోచించుకోవాలని హితవుపలికారు. నిజంగా అధికారులకు, ప్రభుత్వానికి , ప్రజాప్రతినిధుల కు చిత్తశుద్ధి ఉంటే మరోక కార్మికుడు బలికాకముందే వెంటనే సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సిరిసిల్ల నేతన్నల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సమస్యల పరిష్కారం కోసం సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అల్‌ట్రేడ్ యూనియన్ అధ్వర్యం లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో మూషం రమేష్, పంతం రవి, మండల సత్యం, తాటిపాముల దామో దర్, కట్టెకోల లక్ష్మీనారాయణ, సిరిసిల్ల రవీందర్, కోడం రమణ, సిరిమల్ల సత్యం, మండల రాజు, వెల్దండి దేవదాస్, గౌడరాజు, పిస్క మధు, వేముల దామెదర్, బోడ్డు శ్రీధర్, నక్క దేవదాస్, ఒగ్గు గణేష్, బండారి అశోక్ పాల్గొన్నారు.

భూషణరావుపేటలో ఉచిత వైద్య శిబిరం

కథలాపూర్, ఏప్రిల్ 7 : మండలంలోని భూషణరావుపేటలో ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక ఆర్ఎంపీ వైద్యుడు బత్తిని శ్రీనివాస్ ఆధ్వర్వంలో నిర్వహించిన శిబిరంను రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ ఛైర్మన్ లోక బాపురెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ వైద్యుడు మాట్లాడుతూ యోగ, ధ్యానం, వ్యాయామం చేయడం వల్ల మానసిక ప్రశాంతత ఉంటుందని సూచించారు. దీంతో బీపీ, మధుమేహం, గుండె జబ్బులు దరిచేరవని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బద్దం మహేందర్, వంగరి నాగరాజు తదితరులు ఉన్నారు.

మల్లన్న జాతరకు హాజరైన ఎమ్మెల్యే



పెగ్గెర్లలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

కథలాపూర్, ఏప్రిల్ 7 : మండలంలోని ఊట్‌పల్లిలో ఆదివారం జరిగిన మల్లన్న జాతరకు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు కాంగ్రెస్ శ్రేణులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలకగా అర్చకులు పూర్ణకుంభంతో ఆహ్వానించారు. కాగా జాతరకు చుట్టు పక్కన గ్రామాలైన భూషణరావుపేట, పెగ్గెర్ల, చింతకుంట, మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం మహిళలు బోనాలు సమర్పించు కోగా పుర వీధుల వెంట డోలు వాయిద్యాలతో కళాబృందం చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముదాం రాజేశం, శేఖర్, చెదలు సత్యనారాయణ, కాయితి నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

'ముస్లింల అభివృద్ధికి కృషి'

మెట్‌పల్లి, ఏప్రిల్, 7 : ముస్లిం, మైనార్టీ సోదరుల అభివృద్ధికి ఎల్లపుడు కృషి చేసేది కాంగ్రెస్ పార్టీ అని సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పట్టణాధ్యక్షుడు ఎంఏ ముఖీమ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. విందులో పాల్గొన్న ముస్లిం సోదరులకు పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విరమింప జేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఎంతో నియమనిష్టలతో రంజాన్ ఉపవాసాలు ఉంటారని ఆధ్యాత్మికంగా పవిత్ర కార్యక్రమం జరపడం మహేందర్ రెడ్డిని అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెట్టి లింగం, ముఖీమ్, పూజాగిరి శ్రీనివాస్, రాము, భానుమూర్తి పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం సోదరులు

రాయికల్, ఏప్రిల్ 7: రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని రాయికల్ పట్టణంలోని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ప్రగతి యాజమాన్యం గొప్పతనమని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు సోహైల్, మత పెద్దలు సద్దాం, సాహెబ్, మహబూబ్, నయీం, ముస్తాక్ అహ్మద్, మున్నా, సాబీర్, ప్రగతి పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న భక్తులు

కొడిమ్యాల, ఏప్రిల్ 7 : మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని ఆదివారం భక్తులు అన్నదానం నిర్వహించారు. అంతక ముందు ఆలయంలో పూజారి భాస్కర్ హోమం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో హన్మాన్ సేవా సమితి సభ్యులు, పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగ రావు



వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు

కోరుట్ల, ఏప్రిల్ 7 : ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవడం అభినందనీయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జు జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని కల్లూర్ రోడ్డులోని సత్యసాయి సేవా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముందస్తు ఉగాది వేడుకలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తస్నీర్ శ్రీనివాస్ రావులతో కలిసి జువ్వాడి నర్సింగ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి ఏర్పాటు చేసిన ఉగాది పచ్చడిని స్వీకరించి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సింగ రావు మాట్లాడారు. సేవా సమిత సభ్యులు చేసున్న సేవ కార్యక్రమాలు మరవలేనివని అన్నారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగ రావు, జువ్వాడి కృష్ణారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తస్నీర్ శ్రీనివాస్ రావులను సమితి సభ్యులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎంబేరీ నాగభూషణం, మెర్గాడ్ లక్ష్మీనారాయణ, సత్యసాయి సేవా సమితి సభ్యులు చిద్రాల అశోక్, చిద్రాల నారాయణ, కాంగ్రెస్ నాయకులు కర్నాకర్ రావు, కొంతం రాజ, పెరుమాండ్ల సత్యనారాయణ, ఏలేటి మహిపాల్ రెడ్డి, రాజోజీ సదానందం, సంగ లింగం, ఎంబేరి సత్యనారాయణ, చిటిమెల రంజిత్ గుప్తా, చిట్యాల లక్ష్మీనారాయణ, లక్కాకుల సద్గురు, శంభోజీ మధు, తెడ్డు విజయ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

సిరికొండ సబ్‌స్టేషన్‌కు మోక్షమెప్పుడో..!

- లోవోల్టేజీతో రైతాంగం సతమతం
- స్థలం ఎంపికలో జాప్యమే కారణం

కథలాపూర్, ఏప్రిల్ 7: వేసవి కాలం వచ్చిందంటే సిరికొండకు విద్యుత్ కష్టాలు తప్పడం లేదు. నిరంతరం లోవోల్టేజీ సమస్య అక్కడి రైతులను వేధించడం పరిపాటి కాగా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోనే అత్యధిక జనాభా ఉన్న సిరికొండపై గత పాలకులు చిన్న చూపు చూడడం వల్ల విద్యుత్ ఇబ్బందులు నీడలా వెంటాడుతున్నాయని వాపోతున్నారు. దీనికి తోడు స్థలం ఎంపికలో జరుగుతున్న జాప్యం రైతులకు శాపంగా పరిణమించింది. నానాటికీ విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు పెరిగిపోతున్నప్పటికీ ఎన్‌పీడీసీఎల్ అధికార యంత్రాంగం సబ్‌స్టేషన్ ఏర్పాటు ప్రతిపాదనను సీరియస్‌గా తీసుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

● లోవోల్టేజీతో తప్పని అవస్థలు

సిరికొండలో అత్యధిక జనాభా, ఓటర్ల సంఖ్య అధికంగా ఉండగా ప్రతీ ఎన్నికల సీజన్‌లో వివిధ పార్టీల నేతలు ఓట్ల కోసం ప్రధానంగా దృష్టి సారిస్తుంటారు ఎన్నికలు ముగిసాక ప్రధాన సమస్యలను గాలికి వదిలేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ దాదాపు 115 గృహ, వ్యవసాయ సంబంధ ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేస్తున్నాయి. 32 కేవీ, 100 కేవీ, సింగిల్ ఫేజ్ ట్రాన్స్ ఫార్మర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఏటేటా బోర్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం అధికమవుతోంది. ఈ క్రమంలో సిరికొండలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ అవసరమని రైతాంగం ఎన్నో రోజుల నుంచి వినతి పత్రాలు అందిస్తున్నా ఫలితం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుకుగాను సుమారు 20 గుంటల స్థలం అవసరం కాగా రెండు పర్యాయాలు పలు చోట్ల పరిశీలన జరిపారు. స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు విద్యుత్ అధికారుల దృష్టికి తెచ్చినప్పటికీ రెవెన్యూ అధికారులతో సమన్వయం చేయని కారణంగా సమస్య కొలిక్కి రాలేదని తెలుస్తోంది.



సిరికొండలో గుర్తించిన స్థలం

● అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి

గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ సిరికొండ



ప్రతీ ఏటా వ్యవసాయ మోటర్లు పెరిగిపోతున్నందు వల్ల విద్యుత్ వినియోగం అధికంగా ఉంటోంది. దీనికి అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లను పెంచుకోవాల్సి వస్తోంది. అయినప్పటికీ లోవోల్టేజీ సమస్య పరిష్కారం కావడం లేదు. సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తేనే కొంత మేర రైతులకు, గృహ వినియోగదారులకు ఉపశమ నం కలుగుతుంది. అధికారులు ప్రత్యేక చొరవ చూపితేనే సబ్ స్టేషన్ ఏర్పాటుకు అవకాశం ఉంది.

విద్యుత్ సిబ్బంది కొరత తీర్చాలి

గాండ్ల స్వామి, రైతు



విద్యుత్ అంతరాయాలను నివారించడం కోసం సిబ్బంది ప్రధానం. సిరికొండలో కొన్ని ఏళ్లుగా కీలక మైన లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, జేఎల్ఎం, ఏఎల్ఎం పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి.

సమీప గ్రామాల్లో ఉంటున్న సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. సకాలంలో అంతరాయాలను నివారించడం కష్టంగా ఉంది. రెగ్యులర్ సిబ్బందిని నియమించి ఇబ్బందులు తొలగించాలి. అదేవిధంగా రెవెన్యూ, విద్యుత్ అధికారులు కలిసి స్థలం ఎంపిక పూర్తి చేయాలి.

తైబజార్ వేలం నిర్వహణలో రగడ

మున్సిపల్ సిబ్బందిని అడ్డుకున్న కూరగాయ రైతులు

కోరుట్ల, ఏప్రిల్ 7 : పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించు తైబజార్ వేలం నిర్వహణలో వివాదం చెలరేగింది. నిత్యం మార్కెట్‌కు కూరగాయాలతో పాటు ఇతర మార్కెటింగ్ చేసే రైతులు నూతనంగా నిర్వహించే తైబజారు వసులను వ్యతిరేకించడంతో మార్కెట్‌లో వివాదం నెలకొంది. గత ఎన్నికలో ప్రధాన పార్టీలకు చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులు తాము గెలిస్తే తైబజారు నిర్వహణను రద్దు చేస్తామని ప్రకటించడంతో మార్కెట్‌లో కూరగాయాలు విక్రయించే రైతుల తైబజార్ వసులను వ్యతిరేకించి డబ్బులు చెల్లించడానికి విముఖత చూపారు. ఈ నెల మార్చి చివరి వారం మున్సిపల్ అధికారులు కోరుట్ల పట్టణంలో తైబజారు నిర్వహణకు వేలం పాట పాడగా పట్టణానికి చెందిన ఓవ్యక్తి రూ. 14.65 లక్షలకు వేలం పాడి దక్కించుకున్నాడు. ఈ నెల 1వ తేదీ నుంచి తైబజారు నిర్వహణ కోసం పట్టణంలోని గడిగుర్దు ప్రాంతంలో కూరగాయ మార్కెట్ వద్ద రైతులు, వ్యాపారుల వద్దకు వసులకు వెళితే నిరాకరించంతో వ్యాపారులతో పాటు రైతులకు తైబజారు నిర్వాహకులు సముదాయించినా లాభం లేకుండా పోయింది. ఈ క్రమంలో ఆదివారం రోజు తైబజారు నిర్వహకులు మరో మారు మున్సిపల్ సిబ్బందితో కలిసి వసులకు వెల్లగా కూరగాయల రైతులు, వ్యాపారులు వ్యతిరేకించారు. దీంతో తైబజారు నిర్వహకులు వ్యాపారులు, రైతులతో వాగ్వాదానికి దిగారు. మున్సిపల్ సిబ్బంది వారి వద్ద ఉన్న కూరగాయాలను మున్సిపల్ వాహనంలో తరలించడానికి ప్రయత్నం చేయడంతో వ్యాపారులు, రైతులు అడ్డుకున్నారు. దీంతో కొంత మేర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్బంగా వ్యాపారులు, రైతులు వారితో తమకు ఇక్కడ ఎలాంటి మౌలిక సౌకర్యం కల్పించడంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిదులు విఫలం అయ్యారని ఆరోపించారు. కనీసం మహిళ రైతులకు బాత్‌రూంలు కూడా ఏర్పాటు చేయలేదని వాపోయ్యారు. వేలం వేసిన వ్యక్తులు విక్రయాలకు వచ్చిన వారి నుంచి అధిక వసూళ్లకు పాల్పడే ప్రయత్నం చేస్తూ రైతులను, వ్యాపారులను ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులు కోరుట్ల మున్సిపల్ పరిధిలో తైబజారు ఉండదని హామీ ఇచ్చి మరిచారని ఇప్పడికైన ప్రజాప్రతినిదులు, అధికారులు చర్యలు తీసుకోని తైబజార్ తీసి వేయాలని వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. తైబజారు నిర్వహణలో ఎలాంటి మార్పు ఉండదని తమకు ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు రాలేదని మున్సిపల్ కమీషనర్ తిరుపతి తెలిపారు. వ్యాపారులు ఎప్పడి లాగే తైబజారు వసులను సహకారం అందించి అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.



మున్సిపల్ సిబ్బందిని అడ్డుకున్న వ్యాపారులు, కూరగాయ రైతులు

నియామకం



నియామక పత్రం అందిస్తున్న జీవన్‌రెడ్డి

మెట్‌పల్లి, ఏప్రిల్, 7 : తెలంగాణ ప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎల్లాల జలపతిరెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావులు జగిత్యాలలో అందజేశారు. ఆదివారం తెలంగాణ ప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డితో కలిసి వారు నియమాక పత్రాన్ని అందజేసి అభినందించారు. వ్యవసాయానికి పెద్దపీట వేసే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని లోక్ సభ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి స్థానిక నాయకులతో కలిసి కృషి చేస్తానన్నారు.

తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ జీవ న్‌రెడ్డి, కోరుట్ల నియోజక వర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరా వు, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీను, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మేడి పల్లి సత్యంలకు కృతజ్ఞతలు తెలిపారు.

మల్లాపూర్: జగిత్యాల జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లాపూర్‌కు చెందిన మాజీ జడ్పీటీసీ ఎల్లాల జలపతి రెడ్డి నియమాకంతో మండల ప్రజలు హర్షం వ్యక్త చేశారు. ఆదివారం మండలంలోని మొగిలిపేట గ్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేసి, ఆయన నియమాకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజక వర్గం ఇన్‌చార్జీ జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు, నేతన్నలను వంచించి దీక్షలు చేయడమా?

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7: పదేళ్ల కాలంలో అధికారంలో ఉండి అన్నదాతలు, నేతన్నలను పట్టించుకోకుండా వంచించిన బీఆర్ఎస్, మాజీ మంత్రి కేటీఆర్ దీక్షలు చేయడం ఏమిటని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ప్రశ్నించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ దీక్ష చేయడం దొంగతనం చేసినోళ్లు దొంగ దొంగ అని అరిచినట్టుందన్నారు. రైతులను ఆదుకోకుండా మోస గించి ప్రస్తుతం అన్నదాతలకు అండగా పోరాడుతామని పేర్కొనడంతో రాజకీయ రంగు బయట పడుతోందన్నారు. నేతన్నకు చెల్లించాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉంచి నేతన్న సంక్షేమం కోసం మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలో ఉన్న సమయంలో సర్కారు రైతులు, నేతన్నలను ఆదుకుందని నిజాయితీగా ధర్నా, రాస్తారోకోలు చేస్తే ప్రజలు నమ్ముతారన్నారు. ప్రభుత్వ హయాంలో వారి సంక్షేమాన్ని విస్మరించి రాజకీయ పబ్బం కోసం ఆందోళనలు చేస్తామంటే చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. గత ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా మార్పు రాలేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ కల్లబొల్లి మాటలతో ఊసరివెల్లి రాజకీయాలకు తెరలేపుతున్నారని మండి పడ్డారు. చేసిన తప్పులను ఒప్పుకొని రైతులు, నేతన్నలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటు పడుతోందన్నారు. తుక్కుగూడలో కాంగ్రెస్‌ఆధ్వర్యంలో నిర్వహించినబహిరంగ సభను విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు లింగాగౌడ్, రాంరెడ్డి, బాల్‌రెడ్డి, రాజుకుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 7: జిల్లా క్రీడకారులు జాతీయ స్థాయి పోటీలలో రాణించాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలో రాజన్న సిరిసిల్ల ప్రీమియర్-2024 క్రికెట్ పోటీలను బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యతను చాటుకుంటూ క్రికెట్ పోటీలను నిర్వహించుకోవాలన్నారు. పట్టుదలతో సాధన చేయాలని, పోటీలో ప్రతిభను కనబరిస్తే తప్పకుండా గుర్తింపు ఉంటుందని అన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకు న్నారు. సోమవారం ఉదయం ఆరు గంటలకు సిరిసిల్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రచారంలో భాగంగా మార్నింగ్ వాక్‌లో పాల్గొని పట్టణ ప్రజలను నేరుగా కలుస్తారన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, నాయకులు గుండ్లపెల్లి పూర్ణచందర్, అడగట్ల మురళి, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాలువ తవ్వి ఆరేళ్లు..బ్రిడ్జి నిర్మాణానికి ఎన్నేళ్లు

ఆందోళన చెందుతున్నరైతులు



బ్రిడ్జ్ నిర్మించాలిసిన స్థలం ఇదే

కొడిమ్యాల, ఏప్రిల్ 7 : ప్రభుత్వం, పాలకులు మారినా తమ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటోందని బూరుగుకుంట ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొడిమ్యాల నుంచి బూరుగుకుంటకు వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మాణం కోసం సుమారు ఆరేళ్ల క్రితం కాల్వను తవ్వారు. కానీ ఇన్నేళ్లు గడిచినా అధికారులు కాల్వపై బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టడం మాత్రం మరిచారు. దీంతో నిత్యం సుమారు మూడు వందల మంది గుట్టవైపు ఉన్న వ్యవసాయ భూముల వద్దకు వెళ్లే వారు, గొర్రెల కాపరులు, కూలీ పనులకు వెళ్లేవారు సుమారు అర కిలోమీటరు దూరం అదనంగా తిరిగి నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. స్థానిక ప్రజల రాకపోకల కోసం కొడిమ్యాల మైసమ్మ చెరువు నుంచి పంప్‌హౌస్ వరకు కాల్వను తవ్వారు. కాల్వ తవ్వుతున్న సందర్భంలోనే తమ భూములు కోల్పోవాల్సి వస్తుందని కొంత మంది అడ్డుకున్నారు. కానీ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కాల్వను తవ్వటానికి కొడిమ్యాల ప్రాంత రైతులు ఒప్పుకున్నారు. దీంతో పనులు పూర్తయి సుమారు ఆరేళ్ల గడుస్తున్నా బ్రిడ్జ్ నిర్మాణం కాక పోవటంతో రైతులు దూరం తిరిగి వారి వ్యవసాయ పనులకు వెళ్లటంతో నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని అధికారులకు, పాలకులకు పలుమార్లు అందించిన వినతి పత్రాలు బుట్టదాఖలే అయ్యాయని, తమ సమస్యలను ఎవ్వరు పట్టించుకున్న పాపాన పోలేదని ఈ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవ తీసుకొని కాల్వపై బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, బ్రిడ్జ్ నిర్మాణం చేయించటానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

సరిపల్లి రత్నాకర్‌రెడ్డి (కొడిమ్యాల-రైతు)



కొడిమ్యాల మైసమ్మ చెరువు నుంచి పంప్ హౌజ్ వరకు తవ్విన కాల్వపై బ్రిడ్జ్ నిర్మించటానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. బ్రిడ్జ్ నిర్మాణం చేసి కొడిమ్యాల నుంచి బూరుగుకుంటకు వెళ్లే రైతులకు ఇబ్బందులు లేకుండ చూడాలి.

బ్రిడ్జ్ నిర్మిస్తే అర కిలోమీటరు దూరం అదనంగా తిరుగుడు త ప్పుతుంది. మా రైతులకు సౌకర్యంగా ఉంటుంది.

పేదలకు సరుకుల పంపిణీ

రాయికల్, ఏప్రిల్ 17: మండలంలోని కైరి గూడెం గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు సామాజిక సేవ కుడు కడకుంట్ల జగదీశ్వర్-శ్వేత దంపతులు ఆదివారం వివాహ వార్షికోత్సవం సందర్భంగా నిత్యావసర సరుకు లైన బియ్యం, పప్పు, నూనెలు, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు నరేష్, మల్లేష్, నాయకులు ఎద్దండి ముత్యంపు రాజురెడ్డి, సాయి కుమార్, సయ్యద్ రసూల్, ఇమ్మడి విజయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా



బోల్తా పడ్డ కారు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 7: మండలంలోని రామారావుపల్లె గ్రామ శివారులో ఆదివారం ప్రమాదవశాత్తు కారు బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు కారులో మండలంలోని కోనరావుపేట గ్రామానికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో కారు బోల్తా పడింది. కారులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామాల మధ్య రోడ్డు వేసేందుకు రెండేళ్ల క్రితం పనులు కాంట్రాక్టర్ ప్రారంభించారు. ఈ మేరకు మూడు నెలల క్రితం కంకర పోసి వదిలేశాడు. అప్పటి నుంచి రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి పనులను త్వరగా పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



బోనాలు ఊరేగిస్తున్న మల్లన్న భక్తులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 7: మండలంలోని ఎర్దండి గ్రామంలో ఆదివారం మల్లన్న బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మల్లన్న కల్యాణం కన్నుల పండువగా జరిపారు. మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మల్లన్నకు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు నాయకులు కల్లెడ గంగాధర్, కూన రాకేష్, ఆవుట్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

మొక్కుబడి చలి వేంద్రం

పట్టించుకోని పంచాయతీ సిబ్బంది



నిర్వహణ లేక మూలన పడ్డ చలివేంద్రం

కొడిమ్యాల, ఏప్రిల్ 7 : ప్రజల దాహార్తి తీర్చేందుకు గ్రామ పంచాయతీ సిబ్బంది ఏర్పాటు చేసిన చలి వేంద్రం నామమాత్రంగానే మిగిలిపోయింది. మండల కేంద్రంలోని అంగడి బజారులో గ్రామ పంచాయతీ కాంప్లెక్స్ షటర్ ముందు ఏర్పాటు చేసిన చలి వేంద్రం అధికారులు, సిబ్బంది పట్టించుకోక పోవటంతో నామ మాత్రంగానె ఉన్నది. సుమారు 10 రోజుల క్రితం ఏర్పాటు చేసిన చలి వేంద్రం నిర్వహణ సరిగ్గా లేక మూలకు పడింది. కనీసం అందులో నీరు నింపాలనే ఆలోచన కూడా అధికారులకు కలగకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తెలంగాణ అభివృద్ధికి కృషి

ముస్తాబాద్, ఏప్రిల్ 7: తెలంగాణ అభివృద్ధికి వినోద్ కుమార్ కృషి చేశారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ముస్తాబాద్ మండలం మోయినికుంటలో ఆదివారం మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఢిల్లీ స్థాయిలో ముఖ్య భూమిక పోషించారన్నారు. కరీంనగర్ ఎంపీగా వినోద్ కుమార్ గెలవడం ఖాయమన్నారు. పదేళ్ల కాలంలో ఎండని మిడ్‌మానేరు కేవలం మూడు నాలుగు నెలల్లో బీటలుబారి పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్ట పోయిన రైతులను ఆదుకోవాలన్నారు. ఆర్‌బీఎస్ మండల మాజీ అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, మాజీ ఎంపీసీ ఛైర్మన్‌లు బత్తుల అంజయ్య, యాది మల్లేశ్, శీలం జనాబాయి, మాజీ సర్పంచ్ ద్యావతి పండరి, కొమ్ము బాలయ్య, చెవుల మల్లేశ్ పాల్గొన్నారు.